# కూరాకుల మడి



డా॥ అయ్యగారి సీతారత్నం

## కథా క్రమం


| | | |
|---|---|---|
| **1.** | లాస్ట్‌మెయిల్ | **11** |
| **2.** | కూరాకుల మడి | **22** |
| **3.** | ముతా సిన్నమ్మ | **31** |
| **4.** | అదే చట్రం | **39** |
| **5.** | మదుపు | **45** |
| **6.** | కాలేజీలో ఒక రోజు | **54** |
| **7.** | నీకూ నాకూ మధ్య పనిమనిషి | **63** |
| **8.** | ఈ వేళలో | **71** |
| **9.** | బిగివీడిన బంధం | **80** |
| **10.** | రిపోర్ట్ | **88** |
| **11.** | శతమానాలు | **95** |
| **12.** | శాంతీష్ సెల్ | **104** |
| **13.** | 'ఎన్నారై' పెళ్ళికొడుకు | **110** |
| **14.** | అప్పాయమ్మ.కామ్ | **117** |

# కూరాకుల మడి

తలదువ్వుకొంటున్న కనకని చూసి, తండ్రి వీర్రాజు "తెల్లారిందా ముస్తాబుకి.... పాచిపనికి వెళ్తున్నావా? పెళ్ళికి వెళ్తున్నావా?" అని విసుగ్గా పాకలోకి వెళ్లి, 'పన్నెండువేలు ఎట్టి పెళ్లిచేసా? వెయ్యిరూపాయలు దానిమొగుడు దినానికి ఖర్చు పెట్టా... పాపిష్టిది. ఏడాదికే మొగుడు పోవడమేమిటి....' గొణుక్కుంటూనే ఉన్నాడు. కనకకి ఆ మాటలు అలవాటయిపోయాయి.

"కనకా!" అంటూ వచ్చింది సత్యవతి.

"ఇదిగో వస్తున్నా! అని జడక్లిప్పు పెట్టుకుని వస్తూ ప్లాస్టిక్‌సంచీ చేతిలోకి తీసుకొంది.

"ఏంటే అదీ"

"ఏవున్నాయి. డబ్బాలు, ఐస్‌క్రీమ్ డబ్బాలు ఖాళీవి. అమ్మగారు ఇచ్చారు. రోజూ పట్టుకుపోతాను. ఆళ్లు స్టీలు గిన్నెలు ఇవ్వడం... తేలేదనడం... ఎందుకొచ్చిన గొడవనీ..." అంటూ చెప్పులు వేసుకొని బయటకి వచ్చింది.

ఆ వూర్లో పన్నెండు దాకా ఇళ్ళు. మిగతావి పెంకుటిళ్ళు, పాకలు. పాకల్లో వాళు ్ల పనమ్మాయని పెట్టుకోరు. పెంకుటిల్లువాళ్లు కేవలం గిన్నెలు తోమించుకుంటారు. డాబా ఇళ్లవారు తడిబట్ట పెట్టించుకుంటారు. అన్ని పనులూ చేయించుకుంటారు. వాళ్లు ఎక్కువ డబ్బులు ఇస్తారు. అందుకని డాబా ఇంటి పనికోసం పోటీపడతారు.

నడుస్తున్న సత్యవతి "మామిడిచెట్టున్న ఇంట్లో రేపు కొత్తగా ఎవరో దిగుతారు తెల్లారగట్లే వస్తారు. మనం కాస్త ముందు లేచి వెళ్లి ఆ ఇంటిపని దొరకపుచ్చుకోవాలి. ఇద్దరి పిల్లల్నీ బళ్లో ఏసానా? ఫీజులు కాట్టాలి. బావకి డబ్బు తాగడానికే చాలదు. ఆళ్లకి నేను కట్టాలగదే... రోజూ ఆళ్లని సదువు మాన్పించేయమని గొడవే..." అంది.

"బావ మారడింక...."

"సర్లే, డబ్బు సరుదుకోవాలి. వాళ్లని సదువు మాన్పించవద్దని గొడవాడాలి. పేనాలు విసిగి పోతున్నాయి" అంది విచారంగా. మాటలు వింటున్న కనక తను పనిచేసే ఇల్లు రాగానే ఆగిపోయి "పనయ్యాక నా కూరాకులమడికి వచ్చీ" అని చెప్పింది.

మడిని దూరంగా చూస్తూనే మురిసిపోయింది. ఉత్సాహంగా, గబగబా అడుగులేసింది. మడి ముందున్న రెండు బంతిమొక్కలు, విరగబూసిన పెరుగుబంతిపూలతో తలలూస్తూ స్వాగతిస్తున్నాయి కనకకి. ఎంతో హాయిగా, ఆనందంగా అన్పించి ఆ రెండు మొక్కల్ని ఆప్యాయంగా సున్నితంగా తడిమి మడిలోకి అడుగుపెట్టింది.

మడిచుట్టూ గట్టు. గట్టుమీద ఎనిమిది టేకుమొక్కలు. నాలుగు కొబ్బరి మొక్కలు. అవి టౌన్‌కి సినిమాకి వెళ్లినప్పుడు ఫారెస్ట్ ఆఫీస్‌కి వెళ్లి తెచ్చుకొన్నవి. అమ్మమ్మ కనక పేర రాసిన ఇరవై సెంట్లు భూమే ఈ కూరాకుల మడి. మడి చుట్టూ జిల్లేడు మొక్కలు వేసింది. అవి పెరిగి ఫెన్సింగ్‌లా మారాయి. ఎవరూ చెప్పకపోయినా భూమాతని నమ్మి బ్రతికే కుటుంబంలోని కనక 'జీవకంచె'ని సునాయశంగా వేసింది. ఆ కంచెమీదకి ఆనపపాదు, కాకకరపాదు, దొండపాదులు రెండు... దోస... కంచెకి ఎక్కించింది. టమాటా నారు, గోంగూర, కొత్తమీర... వంగ, చేమ, గోరుచిక్కుడు నేలమీద ఉన్నాయి. అన్నీ మంచి కాపుమీదున్నాయి. వారానికి ఒకమారు సంతకెళ్లి అమ్ముకొస్తుంది. మడి మీద పన్నెండువేలు నెలకి వస్తాయి. అయితే కనక చాలా కష్టపడ్తుంది. రోజూ అయిదుగంటలు మడిలో ఉంటుంది. ఎక్కడ కనబడ్డా వానపాములు మట్టితో సయితం తెచ్చి తనమడిలో వేస్తుంది. పనిచేసే ఇళ్లల్లో నుండీ కూరతొక్కంతా తెచ్చి గోళెంతో మట్టేసి అందులో వేసింది. ఏటినుండి నీళ్లు మోసి తెచ్చిపోస్తుంది. తల్లి బిడ్డని సాకినట్టుగా కూరాకుల

# అదే చట్రం

'పూర్వంలా కాదు. ఇప్పటి ఆడపిల్లలకేం... కావాలంటే ఆ అమ్మాయిని అడగండి....' అని ఒక మేడమ్ నావైపు చూపడంతో నాతో పనిచేస్తున్న టీచర్స్ అందరి దృష్టీ నామీద పడింది.

నా పేరు కాంచన. మా నాయనమ్మ పేరు కాంచనదుర్గ. నాజూగ్గా వుండదని దుర్గ తీసేసి కాంచన అని పెట్టారు. చిన్నప్పుడు మా నాన్న సినిమాఏక్టర్ కాంచనలా వుంటానని మురిసిపోయేవారు. పెద్దయ్యాక సినిమాఏక్టర్ అనుష్కలా అందంగా వుంటానని తీర్మానించారు. నేను అందగత్తెననే విషయం నా అయిదో ఏడునే అర్థమయ్యేటట్టు చేసారు. ఎమ్.సెట్‌లో లక్షల మీద రేంక్ వచ్చింది. రెండులక్షలు కడితేగానీ సీటు రాదన్నారు. దానికి తోడు ఎక్కడికో పంపాలి. మళ్లీ పెళ్లికి ఖర్చే కదా... అని, దూరంగా ఇంత అందమైన అమ్మాయిని ఏం పంపుతామని బి.ఎస్‌సి. కంప్యూటర్స్‌లో చేర్చారు. నేను ఫస్ట్ క్లాస్ డిగ్రీ తెచ్చుకొన్నాను. ఎమ్మెస్సీ చదువుదామనే అనుకొన్నాను. కానీ వీధి చివర అంటీవాళ్ల అబ్బాయి బి.టెక్. చేసి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న గణేష్ నన్ను

చూసి చాలా ఇష్టపడ్డాడట. అందుకని వాళ్లు పిల్లనియ్యమని అడిగారు. వాళ్లంతటవాళ్లు అడిగారు. ఆస్తిపరులు, మంచివాళ్లు, చదువుకొన్నవాళ్లు, పైసాకట్నం లేదు. కాదనడానికి మా వాళ్లకి కారనం లేదు. నాకు మాత్రం పి.జి. చేస్తే మంచిదేమో అన్పించింది. యూనివర్శిటీ మెట్లు ఎక్కేయోగం లేదేమో అనుకొన్నాను. కొంతమంది మాత్రం అప్పుడే పెళ్లికి తొందరేంటి, చదివించు... అని సలహా ఇచ్చారు. నేను కూడా అమ్మని నెమ్మదిగా అడిగాను. అమ్మా నాన్నలకి నేనంటే ఎంతో గారం. ఒక్కర్తినే. అబ్బాయికోసం చూడకుండా నన్ను బాగా చూసుకోవాలని ఆపరేషన్ చేయించుకున్నారు. అందుకనే అమ్మతో పోట్లాడాలన్పించదు. అమ్మని పదేపదే అడిగా. అమ్మ “నీమొహం. తర్వాతైనా చదువుకోవచ్చు. చుట్టా కబుర్లు వినకు. అందరికీ జెలసీనే. ఇంత మంచి సంబంధం కాళ్ల దగ్గరికొచ్చిందనీ కుళ్లుబోయేవాళ్లే. వాళ్లకేం తెలుసు. నువ్వు మా బంగారానివి. నే చెప్పినట్టు విను. నాన్నకి ఈ సంబంధం చాలా ఇష్టం. ఆ కుర్రాడు ఎంత బాగున్నాడు. షారూక్‌ఖాన్‌లా ఉన్నాడు. మీ ఇద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉంటారు...” అని అనగానే అతని రూపం కళ్లల్లో కనబడింది. అతని నవ్వు నిజంగానే చాలా మోహనంగా ఉంటుంది. కనుబొమ్మలెగరేస్తూ చూపుతోనే పలకరించే తీరు. తలచుకొంటేనే ఝల్లుమంది. అంతే, చదువు సంగతి వదిలేసాను. పెళ్లయ్యాక చదువుతానులే అనుకొన్నాను. పెళ్లి సందడిగా జరిగింది. పూర్వంలా మగపెళ్లివారి అలకలు అవీ ఏవీ లేవని, అంతా మురిసిపోయారు.

పెళ్లయ్యాక అతను విలన్‌లా ఉంటాడని అనుకోకండి. అతను చాలా మంచివాడు. నా చదువుకీ ఓకే అన్నాడు. ఇంటిపనులన్నిటిలో సాయం చేస్తాడు. ఉల్లిపాయ తరిగితే నాకు కళ్లనీళ్లు వస్తాయని అతనే తరుగుతాడు. పొద్దున్న ఏడుగంటలకి కాఫీ ఇస్తే తాగి వెళ్లిపోతాడు. టిఫిన్, భోజనం అన్నీ కంపెనీలోనే. రాత్రి నేను చేస్తే తింటాడు. లేదా పేక్ చేసి ఇద్దరికీ తెచ్చేస్తాడు. ఆదివారం అంతా తిరుగుడే. అసలుకాలం తెలియలేదు. ఇల్లు అందంగా సర్దుకోవడం, అతను వెళ్లగానే తలుపు వేసుకొని నిద్రపోవడం... నచ్చినపుడు లేవడం... ఇష్టమైనవి తినడం... స్వేచ్ఛగా అన్పించింది. యూనివర్శిటీలో చేరదామనుకొన్నాను. బెంగుళూరులోనే చదవమని రిక్వెస్ట్ చేసాడు. సరేననుకొన్నాను. అప్లికేషన్ పెట్టే సమయానికి మా అత్తగారికి హైబీపీ రావడం, హాస్పిటల్‌లో చేరడం... ఆమెకు సాయంకోసం నేను మావూరు వెళ్లాను. అర్థరాత్రి ఇంటికి చేరే గణేష్‌కి అప్లికేషన్ తెచ్చే సమయం లేదు. ఒక్కసారి ఫ్లయిట్‌లో వచ్చి వాళ్లమ్మని చూసి తల్లి అనారోగ్యంకి బాధపడుతూ వెళ్లిపోయాడు. నెలాపదిహేను రోజుల తర్వాత బెంగుళూరు వెళ్లాను. అప్పటికి

# కాలేజీలో ఒక రోజు

"ఏంటీ... ఫస్ట్ అవర్ లేదా?" అన్నాడు సురేష్ ఆయాసపడుతూ హడావుడిగా వచ్చి.

"లేదు సార్! వియస్‌పి వస్తారుట!" అన్నాడు భగత్‌సింగ్.

"ఎవరూ?"

"మేథ్స్ సర్!"

"ఐదు నిముషాలు అయిపోయింది. మనల్నయితే షంటేస్తాడు" అని గొణుకున్నాడు సురేష్.

అప్పుడే ఆఫీసు నుండీ కబురు 'వియస్‌పి రాలేదు. మిమ్మల్నే వెళ్లమన్నారు'. అని 'ప్చ్! అనుకొని పుస్తకం తీసుకొని లేచాడు భగత్‌సింగ్ వెళ్లిన పది నిముషాలలోనే తిరిగి వచ్చాడు.

"అదేంటీ?" అసహనంగా సురేష్.

"వియస్‌పి వచ్చాడు!" అన్నాడు ముఖం గంటు పెట్టుకొని.

"మధ్యలో, పావుగంట తర్వాత క్లాసా?"

"బాగుంది! గవర్నమెంట్ జీతం యుజిసిది పుచ్చుకొన్న వాడికి

ఉన్న గౌరవం! దీన్ని అంటిపెట్టుకొని చేసేవాళ్లకి ఇస్తారా?" అన్నాడు కసిగా భగత్‌సింగ్

అప్పుడే రూమ్‌కి ఎదురుగా విఎస్‌పి వచ్చాడు. క్లాస్‌లో సెల్ మోగింది. వుంటనే 'హలో' అంటూ స్టయిల్‌గా కారిడార్‌లో తిరుగుతూ మాట్లాడాడు. వెళ్తూ, వెళ్తూ సురేష్ వాళ్లని చూసి –

"నాకు క్లాస్ రూమ్‌లో సెల్‌లో మాట్లాడడం నచ్చదు!"

అని మరీ ఒక నీతి వాక్యం చెప్పి వెళ్లాడు పది నిముషాలు తర్వాత.

"రావడం పది నిముషాలు ఆలస్యం. పది నిముషాలు సెల్, మరో పది నిముషాలు అటెండెన్స్, ఒక చిన్న స్టెప్ అయినా వేసాడంటావా? అమ్మాయిలతో జోకులు...."

"ఎలా ఊరుకొంటున్నాడంటావ్ మన రామిగాడు!" అడిగాడు సురేష్.

"ఎవరూ? ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ రామభద్రంగారా?" అని ఒక చిర్నవ్వు నవ్వి "వాళ్ల కులమేగా" అన్నాడు భగత్‌సింగ్.

"సెల్ తేవద్దని చెప్పొచ్చుగా!"

"వాడేం పట్టించుకోడు. నవ్వుతూ ఏదో సోది చెప్తాడు."

ఇంతలో ఫిజిక్స్ సార్ రాగానే అంతా నిశ్శబ్ధం అయ్యారు. అతను మేనేజ్‌మెంటుకి అన్నీ మోస్తాడని భయం. అతను ఎదురుగా చీమ చిటుక్కుమన్నా ప్రిన్సిపాల్‌కి తెలిసిపోతుంది.

ఇరవై ఐదు నిముషాలు తర్వాత సెకండ్ డిగ్రీ క్లాస్‌కి వెళ్లమని చెప్పడానికి రామభద్రం గారు వచ్చారు. వస్తూనే –

"ఏం చేస్తున్నావ్ భగత్?" అన్నారు.

"ప్రిపేర్ అవుతున్నా సర్!" అన్నాడు భగత్‌సింగ్.

"ఏంటీ? ప్రతిజ్ఞా! శ్రీశ్రీదేనా?

"పొలాలనన్నీ, హలాలదున్నీ

ఇలాతలంలో హేమపిండగ

జగానికంతా సౌఖ్యం నిండగ...." అని నవ్వి

"దీనికి కూడా పెద్ద ప్రిపరేషన్. నాలుగు పుస్తకాలు. వెళ్లవోయ్! ఆ మేడమ్‌గారు సెలవు. ఈ ఆడాళ్లు చెప్పాచెయ్యకుండా పిల్లల రోగాలవంకన ఎగ్గొట్టేస్తారు. ఫోనులో సి.ఎల్ కుదరదని చెప్పినా వినరు. అసలు తీసి పారేయాలి."

# ఈ వేళలో

కాలింగ్‌బెల్ మోగింది. రెండుమూడు సార్లు ఆగకుండా... అంతలోనే తులుపు దడదడా బాదడం... 'బామ్మా...' అనడం ఒకేసారి జరిగింది. 'వస్తున్నా... వస్తున్నా...' అంటూ గబగబా వచ్చి తలుపు తీసింది పార్వతమ్మ.

"ఎందుకు అంత గాభరా... వచ్చేలోపున కంగారు...' అంటూనే మనవడు అనిల్ చేతిలో బేగ్ అందుకొంటూ ... 'టిఫిన్ తిన్నావా? పట్టుకెళ్లినది పట్టుకెళ్లినట్టే తెచ్చావా?....'

'అన్నం కాదుగా. జీరారైస్ కదా! చాలా బావుంది.... తినేసా' అంటూనే లోపలికి వచ్చి టి.వి. రిమోట్ తీసుకొన్నాడు.

'అదేంటిరా? ... బూట్లు విప్పకుండానే... స్కూల్‌డ్రస్ మార్చలేదు... మీ అమ్మకి తెలిస్తే... అన్నం తిన్నాక చూద్దువుగాని...'

'ఛా, నేను అన్నం తినను. ఏద్దైనా ఇయ్యి బోర్నవిటా ఇయ్యి...'

'మీ అమ్మ అన్నం తినమందిరా....!'

ఏవీ పట్టించుకోలేదు అనిల్

'అరుస్తున్నా పట్టించుకోవేం...' అంటూనే బేగ్‌లో బాక్స్ తీసి సింక్‌లో వేసింది.

గబగబా కార్టూన్ ఛానల్ పెట్టాడు.

'అదేంటి నాన్నా. శ్రీకృష్ణావతారం సినిమా చూసాక మార్చొచ్చుగదా!'

'అబ్బా! బామ్మా! ఎన్నిసార్లు చూసినా అవే నాలుగు చేతులు... పొడవుగా చూపిస్తారు...'

'కార్టూన్‌లో ఏంటట... పిల్లి, కుక్క చంపుకొంటుంటాయి. చావవు... ఎప్పుడో తప్ప మంచి సినిమా రానేరాదు. నాకు చూడడం అవదు. అసలు మీకు పెద్దంతరం చిన్నంతరం లేదర్రా...'

'బామ్మా... ఆకలి...' అన్నాడు.

'రిమోట్ ఇమ్మంటే... ఆకలి వచ్చిందా! సర్లే...' అని వెళ్లి వంట గదిలోకి వెళ్లింది. అప్పుడే తలుపు దడదడ మోగింది. వెంటనే కాలింగ్ బెల్ మోగింది.

'అనిల్... తియ్యరా తలుపు, వినబడదా?' అంది గట్టిగా. టి.వి. మీద నుండి దృష్టి మరల్చకుండానే తలుపు తీసాడు.

లోపలికి వస్తూనే మీనా... చెప్పులు విప్పి టక్ మని టి.వి. ఛానల్ మార్చేసింది.

"బామ్మా!" అని ఒక గావు కేక పెట్టాడు.

'ఏవయిందిరా?... అంది బామ్మ కంగారుగా వచ్చి.

'చూడు అక్క...'

'వస్తూనే... ఏంటమ్మా.... తగాదా?...'

'రోబో సినిమాలో ఒక పాట అర్జెంటుగా వినాలి... చెత్త కార్టూన్ రోజూ ఉండేదిగా...'

'చెత్త అన్నావంటే ఐవిల్ కిల్‌యూ'

ఏడిసావ్...! అన్నట్టుగా నాలిక ఆడించి 'ప్చ్' అంది.

దాంతో కోపంతో ఊగిపోయి అనిల్ టక్ మని మళ్లీ మార్చాడు. అంతే అనిల్ చేతిలో రిమోట్ తీసుకొందుకి ప్రయత్నించి రిమోట్ లాక్కుని కుర్చీ మీదకి ఎక్కి పైకి చెయ్యి ఎత్తి పట్టుకొంది. మహావేగంగా కుర్చీమీదకి ఎక్కబోయి సాధ్యంగాక నడుం పట్టుకొని వేలాడుతూ ఊపేసింది.

బామ్మకి కాళ్లూ చేతులూ ఆడలేదు.

"ఛా, ఛా... ఏంటర్రా, కుక్క పిల్లల్లా... బుద్ధిలేదూ, ఆడపిల్ల అని కూడా లేదు.

# రిపోర్ట్

కాలింగ్‌బెల్ మోగింది. "మమ్మీ వచ్చింది" అని మైత్రి పరిగెత్తి వెళ్ళి తలుపు తీసింది. అసలేమీ పట్టించుకోకుండా అజయ్ అమ్మమ్మ చెప్తూ ఆపిన కథమీద దృష్టితో "అమ్మమ్మా... బ్రహ్మదేవునికోసం ఎన్ని ఇయర్స్ తపస్సు చేసింది బెల్లంముక్క... చెప్పూ" భుజంపట్టుకుని కుదిపేసాడు.

"ఏయ్! తమ్మూ, మమ్మీ తిడుతుంది. రేపు విందాం" అని నెమ్మదిగా చెప్పింది.

"ఏంటీ! కథలు వింటూ కూర్చున్నారా? హోం వర్కు చేసారా?" అంది అజిత.

"నేను చేసాను. తమ్ము చేయలేదు."

"ఏం? అమ్మా! అసలు కథలు చెప్పకు. టి.వి. చూస్తున్నాడు. సి.డి. తెస్తున్నారు. చాలదా! అయినా మైత్రీ నువ్వు చదివి వాడికి చెప్పొచ్చుగా!... అమ్మమ్మని విసిగించడం దేనికి...." అంటూనే తనరూమ్‌లోకి వెళ్లి ఫైల్స్ అన్నీ బీరువాపైన పెట్టింది.

"అమ్మా! తొమ్మిది దాటింది. నువ్వు పడుకో నేను వాళ్లని

చూసుకొంటా.....”

“ఫరవాలేదు... స్నానం చేసి భోంచెయ్యి. రేపు ఎన్నింటికి వెళ్లాలి?” అంది తల్లి అన్నపూర్ణ.

‘రేపు 7.30 కి బయల్దేరాలి. ఈ మార్చికాదు గానీ సెమినార్లు హడావుడి ఎక్కువ. మార్చి 31 కి బడ్జెట్ అయిపోతుందని అందరికీ ఒకటే హడావుడి. రిపోర్ట్ పేపర్‌లో రాకపోతే ఒకటే బాధ. కిందటివారం రిపోర్ట్ ఇంకా అవలేదు. రాయకపోతే ఇంకా ఇబ్బంది. స్త్రీలనుంచే ప్రోత్సామం లేదు అని తేలికగా అంటారు. ప్చ్...! ఉమెన్ స్టడీస్ వాళ్లది ఇంకా రాయలేదు.” అంది కొంచెం దిగులుగా.

“వెంట వెంటనే చేసుకోవాలి.”

“ఎలా అమ్మా! సెమినార్‌లో ఫుడ్ నాకు పడలేదుగా. మసాలా నూనె ముద్ద. పొట్టపాడయి రెండ్రోజులు బాధపడ్డాను కదా!....”

“పత్రికల్లో ఉద్యోగాలెందుకంటే విన్నావూ! ఓపూట సెలవు పెట్టచ్చుగా”

“సెలవులన్నీ జయంత్ వచ్చినపుడే పెట్టేసాగదా!”

“మీ ఆయనొకడు.. ఎందుకు దుబాయ్‌లో వెలగబెట్టడం...? పిల్లల ముచ్చట అచ్చట అన్నీ పోగొట్టుకొంటున్నాడు. ఇండియా రావాలని పట్టుబట్టలేవా?”

“బాగుందమ్మ! ఇద్దరూ అనుకొనే నిర్ణయించుకొన్నాం కదా! ఈ జీతాలతో పిల్లల్ని చదివించగలమా? ఈ సౌఖ్యాలు వస్తాయా....”

“సౌఖ్యాలు కోరుకొంటున్నారేగానీ... శాంతి కోరుకోవడం లేదు...” అంటూ అన్నపూర్ణమ్మ అజిత ముఖంలోకి సూటిగా చూసింది.

సన్నగా, పీలగా, తెల్లగా వుండే అజిత ముఖంలో అలసట స్పష్టంగా కన్పిస్తోంది. అలసిన నీ దగ్గరేంవుంటాననేమో నుదుటి మీద స్టిక్కర్ ఎప్పుడో వెళ్లిపోయి నుదురు ఖాళీగా ఉంది. క్లిప్పులోకి నొక్కి వుంచిన చిన్న జుత్తు ఇంకెంత సేపు పొద్దున్నుండీ ఉన్నానని విసిగి బయటకి వచ్చి ఎగురుతూ చెంపలని తాకుతోంది. ఎండలకి హాయిగా వుంటుందని వేసుకొన్న కాటన్ చూడీదర్ నలిగిపోయి, మొత్తంమీద అజిత వాడిపోయిన కలువకాడలా వుంది.

ప్రముఖ పత్రికలో రిపోర్టర్‌గా పనిచేస్తోంది అజిత. భర్త జయంత్ ఐదు సంవత్సరాలనుండి దుబాయ్‌లోనే ఉన్నాడు. మూడులక్షల జీతం. నలభైఐదురోజులు సెలవు. రెండుసార్లు ఇండియాకి టికెట్ ఇస్తారని ఉద్యోగం వదిలిపెట్టి రాలేదు. వచ్చినపుడు మాత్రం ఒకటే హడావుడి, ఆనందం, ప్రేమ ఉక్కిరిబిక్కిరిగా ఉంటుంది అజితికి. ఒక్కరోజు

# శాంతీష్ సెల్

రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో ఆటో దిగి బ్యాగ్ పట్టుకుని నిలబడింది స్నేహప్రియ. విశాఖపట్నం వెళ్ళడానికి ఏ రైలు వుందో కనుక్కొని వస్తానన్నాడు శాంతీష్.

రెండు నిముషాలలో పరిగెత్తుకుంటూ వచ్చి శాంతీష్ "మేడమ్, స్పెషల్ ట్రెయిన్ ఉంది. పది నిముషాలలో వచ్చేస్తుంది. తొందరగా రండి" అని బ్యాగ్ అందుకున్నాడు.

స్నేహ కంగారుగా నడుస్తోంది. చేతిలో హేండ్‌బ్యాగ్ మాత్రమే ఉంది. అది కూడా బరువుగా అన్పిస్తోంది. జనాలంతా ఎవరి హడావిడిలో వాళ్లున్నారు. తోసుకుంటూ వెళ్లిపోతున్నారు. అపుడే సెల్ మోగింది. బ్యాగ్‌లో సెల్ తియ్యడం కూడా కష్టమయింది. రైలు అందుకోవాలన్న కంగారులో ఉన్న స్నేహ – ఫోను తీసేలోపు సెల్ ఆగిపోయింది.

"అప్పుడే 8.30 అయ్యింది. అర్థరాత్రికి గాని చేరలేనేమో."

"కంగారు పడకండి" అన్నాడు శాంతీష్.

"మా బాబుకి బాగులేదు కదా ఏడుస్తున్నాడో ఏంటో"

"ఏం కాదు మేడమ్" అన్నాడు శాంతీష్.

మూడవ ఫ్లాట్‌ఫారం మీదకి వచ్చారు.... ఇంకారైలు రాలేదు. ఖాళీ బెంచీ మీద బ్యాగ్ పెట్టి కూర్చున్నారు. మాటిమాటికి వాచీ చూసుకుంటోంది.

"ఏవన్నా తింటారా? ఇంకా ఐదు నిమిషాలు ఉంది టైమ్"

"ఏం వద్దుగానీ, నేను పొద్దున్న జన్మభూమికి వస్తాను. జాగ్రత్తగా ఉండండి. బయటికి తిరగడానికి ఎక్కడికీ వెళ్లకండి. మేడమ్ ఒక్కరూ అయిపోతారు" అని జాగ్రత్తలు చెప్తోంది స్నేహ.

యూత్ ఫెస్టివల్‌కి నలభై మంది పిల్లతో రాజమండ్రి వచ్చారు స్నేహ. మిత్ర, స్నేహ కొడుక్కి బాగులేదని తెలిసి రాత్రి వెళ్లి పొద్దున్నే మళ్లీ రాజమండ్రి రావాలని బయల్దేరింది. పొద్దున్న ప్రోగ్రామ్స్ హడావిడిలో ఏవీ తినలేదు.

"మేడమ్, ఏవన్నా తినండి."

"వద్దు" అని మళ్లీ శాంతీష్‌కి ఏమన్నా ఇవ్వాలన్పించింది.

"పద, ఏదైనా జ్యూస్ తాగుదాం."

జ్యూస్ తాగుతూ "కేక్ తీసుకోండి. వాటర్ బాటిల్ కూడా. రైలు ఎక్కగానే ఆకలేస్తుంది" అన్నాడు ఆదరంగా శాంతీష్.

అతని ఆప్యాయతకి కాదనలేకపోయింది. బ్యాగ్‌లో పర్స్ తీసి చేతిలో పెట్టింది "డబ్బులిచ్చేయ్."

జాగ్రత్తగా డబ్బులు ఇచ్చి చిల్లర పర్సులో పెట్టి చేతికిచ్చాడు.

పూర్తిగా జ్యూస్ తాగకుండానే రైలు వస్తున్నట్టు అనౌన్స్‌మెంట్,

"పద శాంతీష్" అంది కంగారుగా.

బ్యాగ్ తీసుకొని గబగబా నడిచాడు. చీకటిగాఉంది. రైలు జనరల్ బోగీలు ఫ్లాట్‌ఫారమ్ కన్నా ముందుకి వెళ్లాయి.

గబగబా నడుస్తూ ఆయాసపడుతూ "ఇది ఖాళీగా ఉంది" అంది.

"వద్దు మేడమ్, మరీ అంత ఖాళీది ఎందుకు... ముందుది ఎక్కండి" అన్నాడు శాంతీష్.

"సరే" అని కొద్దిగాజనం ఉన్నదానిలో ఎక్కింది శాంతీష్ బ్యాగ్ సీటుకింద పెట్టి చేతిలో వున్న వాటర్ బాటిల్, కేక్ ఇచ్చాడు.

"సిగ్నల్ ఇచ్చేస్తారు దిగు" అంది గట్టిగా.

"జాగ్రత్త. కేక్ తినేయండి. మానేయకండి."

"థేంక్యూ" అంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kurakula+Madi**

* * *